సాక్షి మెదక్

శుక్రవారం । 26 । జనవరి । 2024



వరి తెగులు.. రైతు దిగులు

వరి సాగు చేసిన రైతులు దిగులు చెందుతున్నారు. పంటకు తెగుళ్లు సోకడంతో ఆందోళనకు గురవుతున్నారు. వివరాలు IIలో ▸



ముడి పదార్థం స్వాధీనం

హెరాయిన్ తయారీలో ఉపయోగించే ముడి పదార్థాన్ని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు IIలో ▸



ఓటుహక్కే ప్రధానం

ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అధికారులు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

ఉత్తమ సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న డీఎంహెచ్‌ఓ చందునాయక్

మెదక్: ఉత్తమ జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ చందునాయక్ ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన 2022–23 హెల్త్ రివ్యూ సందర్భంగా హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తు, హెల్త్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అవార్డు అందజేశారు. మెటర్నల్ హెల్త్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు, చైల్డ్ హెల్త్, ఇమ్యూనైజేషన్‌లో 11వ ర్యాంకు, ఎనిమియా ముక్తా భారత్‌లో 26వ ర్యాంకు, టీబీలో ఫస్ట్ ర్యాంకు, తెలంగాణ డయాగ్నస్టిక్‌లో 2వ ర్యాంకు, ఎన్సిడీలో ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు గానూ బెస్ట్ డీఎంహెచ్‌ఓ అవార్డు వరించింది. ఈసందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది సహకారంతోనే అవార్డు లభించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేస్తే గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకోవచ్చని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని కుకునూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, సర్పంచ్ ప్రీతి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వన దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం ఏడుపాయల వనదుర్గా భవాని మాతకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ పూజారులు మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

తూప్రాన్: త్వరలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ శైలేష్ సూచించారు. పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినొద్దీన్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు, పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న భోజన నాణ్యత గురించి ఆరా తీశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇసుక, మట్టి రవాణాపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ మట్టి రవాణా నివారణకు డివిజన్ల వారీగా మూడు టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్య లకు వెనుకాడబోమని హెచ్చరించారు.



విద్యుత్ దీపాల వెలుగులో కలెక్టరేట్



జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ రాజర్షిషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. విద్యుత్ దీపాలతో కలెక్టరేట్‌ను అలంకరించారు.

– మెదక్ కలెక్టరేట్

ఆటలకు చోటేదీ..?



ఈ చిత్రంలో కనిపిస్తున్న క్రీడా ప్రాంగణం అల్లాదుర్గం మండలం నడిమితండా గ్రామంలోనిది. గుడి ఎదుట బోర్డు ఏర్పాటు చేశారు తప్ప అక్కడ ఎలాంటి ఖాళీ స్థలం లేదు. ఇది ఒక్క అల్లాదుర్గం మండలంలోనే కాదు జిల్లాలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి. యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఊరూరా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి.

మెదక్

- చాలా చోట్ల బోర్డులకే పరిమితం
- జిల్లాలో 469 నిర్మించాలని లక్ష్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

జిల్లాలో 469 గ్రామ పంచాయతీలతో పాటు పట్టణాల్లోని వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. కాగా వీటిలో 70 శాతం స్థలాలు లేని చోట, రాళ్లు రప్పలు ఉన్న ప్రదేశాలు, ఊరికి దూరంగా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. బోర్డులు ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. శాసనసభ ఎన్నికల కోడ్‌కు ముందు అక్టోబర్‌లో స్పోర్ట్స్ కిట్లను హడావుడిగా గ్రామాలకు పంపిణీ చేశారు. అవి ఇప్పుడు గ్రామ పంచాయతీల్లోనే మూలుగుతున్నాయి. క్రీడలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. ఫలితంగా క్రీడా ప్రాంగణాలు

మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలు

పూర్తిస్థాయిలో ఎక్కడా అమలులోకి రాలేదు. అయితే గ్రామ పంచాయతీలకు ఇచ్చిన కిట్లలో వాలీబాల్, క్రికెట్ తదితర సామగ్రి ఉన్నాయి. వాటిని యువతకు, విద్యార్థులకు అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. మరో ఆరు రోజులు గడిస్తే సర్పంచ్‌ల పదవీ కాలం సైతం ముగియనుంది.

మౌలిక వసతులు కరువు

- జిల్లావ్యాప్తంగా గ్రామానికి ఒకటి, మున్సిపాలిటీ పరిధిలో వార్డుకోటి ఇలా పెద్ద ఎత్తున చేపట్టిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అయ్యాయి.
- అందులో ఆటలు ఆడటానికి క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కానీ చాలా చోట్ల అనువుగాని స్థలాల్లో ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.
- అల్లాదుర్గం మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన బోర్డులను పాతి వదిలేశారు. ఇందులో కైదంపల్లి పాఠశాలలో మొక్కుబడిగా, నడిమితండాల్లో ఇళ్ల మధ్య గుడివద్ద, చిల్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.
- కొల్చారం మండలంలోని సంగాయిపేటలో చెరువు కట్ట కింద దంప్‌యార్డు పక్కన బోర్డు ఏర్పాటు చేశారు. అక్కడ ఎలాంటి స్థలాన్ని చదును చేయలేదు.
- రంగంపేటలోనూ చుట్టూ ఇళ్లు, ఒక పక్కన గ్రామ పంచాయతీ భవనం, మరో పక్కన వాటర్ ట్యాంకు మధ్యలో బోర్డు ఏర్పాటు చేశారు.
- కొంగోడు, చిన్నఘనపూర్ గ్రామాల్లో ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు.
- చిలప్‌చెడ్ మండలంలోని గుజిరం గ్రామ పంచాయతీ పక్కనే ఏర్పాటుచేశారు. ఇక్కడ అసలు స్థలమే లేదు. చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో శీలంపల్లి, రహీంగూడ గ్రామాల్లో ఊరికి దూరంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.
- అసద్‌మహ్మద్‌పల్లిలో ఊరికి దూరంగా పిచ్చి మొక్కలతో నిండి ఉంది. కాద్లూర్ సీఎం చెరువు ముందటి తండాలో సైతం ఊరికి దూరంగా ఏర్పాటుచేశారు.



నిజాంపేట పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న స్పోర్ట్స్ కిట్లు

మార్గదర్శకాలు రాలేదు

క్రీడా సామగ్రిని గ్రామాలతో పాటు ఆయా వార్డుల్లో పంపిణీ చేశాం. క్రీడా ప్రాంగణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. క్రీడా ప్రాంగణాల నిర్మాణాలను గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. అవి ఆటలకు అనుకూలంగా ఉన్నాయా..? లేదా అనేది మా దృష్టికి రాలేదు.

– నాగరాజు, జిల్లా యువజన, క్రీడల అధికారి

ఓటు హక్కు వజ్రాయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

- బాధ్యతగా వినియోగించుకోవాలి
- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధితో కూడిన సుస్థిర ప్రజాస్వామ్యాన్ని ఒక్క ఓటుతోనే సాధించుకోగలమని తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలో భారత ఎన్నికల కమిషన్ మార్గ నిర్దేశం చేస్తుండడం గొప్ప విషయమని కొనియాడారు. అనంతరం అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేశ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును ఎవరూ ప్రలోభాలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని హెడ్ ఆఫీస్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

బహుమతుల ప్రదానం

నుక్కడ్ నాటకానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్న నర్సాపూర్ మండలం చిప్పలకుర్తి కేజీబీవీ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అలాగే జిల్లాలో వివిధ కళాశాలలో స్వీప్ కార్యక్రమాలపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులతో పాటు నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులు అందజేశారు. అలాగే ఉత్తమ సేవలందించిన బీఎల్‌ఓలకు, ఇతర అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. గురువారం మెదక్‌లోని వైస్రాయ్ గార్డెన్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న బీజేపీకి మద్దతుగా యువత ను కూడగట్టాలని మోదీ సందేశం అందించారని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, జెడ్పీటీసీ పంజావిజయ్, బీజేపీ ప్రధాన కార్యదర్శులు విజయ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాగి రాములు, ప్రసాద్, ప్రభాకర్, రాజు,దయానంద్‌రెడ్డి, సంతోష్‌చారి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో యంగ్ ఓటర్స్ కోసం గురువారం హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించారు. నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి కేజీబీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు నుక్కడ్ నాటక్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించారు. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు కేజీబీవీ కళాశాల స్పెషల్ ఆఫీసర్ శ్వేత తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

- టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



నియామకపత్రాలు అందుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

మెదక్: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తుందని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో మెదక్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో తమ సేవలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. త్వరలోనే పెండింగ్ బిల్లుల సమస్యలు తీరుతాయని వెల్లడించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియమాకపత్రాలు అందజేసి అభినందించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించారు. టీఎన్జీఓ మెదక్ యూనిట్ అధ్యక్షుడిగా ఆరెళ్ల రామాగౌడ్, కార్యదర్శిగా శ్రీకాంత్, సహాధ్యక్షులుగా శివరాం, కోశాధికారిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా సలీం పాషా, సత్యనారాయణ, తులసీరాం, తుకారం, శేఖర్, సుశీల తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఫజలుద్దీన్, పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల మంజూరులో అవినీతి

- పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని, అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన పనులు రద్దయ్యాయని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులు గుర్తించి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దృష్టికి తీసుకెళ్లి కొత్తగా మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రామాయంపేటలో చాలా వరకు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి అల్లాడి వెంకటేశ్, బీసీ సెల్ పట్టణాధ్యక్షుడు చింతల స్వామి, మాజీ అధ్యక్షుడు డాకి స్వామి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు తార్యా నాయక్, నాయకులు రవి, కుమార్, బాబు, యాదగిరి, ప్రకాశ్, వినయ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుప్రభాతరావు

తూప్రాన్ పీఠంపై కాంగ్రెస్ కన్ను

- అవిశ్వాసం వైపు అడుగులు
- కౌన్సిలర్లతో మంతనాలు
- అధికార పార్టీ నాయకుల క్యాంపు రాజకీయాలు



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం

తూప్రాన్: బీఆర్‌ఎస్ ఆధీనంలోని తూప్రాన్ మున్సిపల్‌పై కాంగ్రెస్ కన్నేసింది. పీఠం చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. కౌన్సిలర్లను మచ్చిక చేసుకొని అవిశ్వాసం ప్రవేశపెట్టే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. కాంగ్రెస్‌కు చెందిన కీలక నాయకుడు రంగంలోకి దిగగా క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సైతం క్యాంపునకు తరలివెళ్లడంతో అవిశ్వాసం వీగుతుందోనని పలువురు భావిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 16 వార్డులు ఉన్నాయి. ఇందులో అధికార కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు, ఒకరు బీజేపీ, మిగితా 13 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారే. కాగా అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు మూడోవంతు కౌన్సిలర్లు (12) ఉంటే సరిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 10 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధం కాగా మరో ఇద్దరి కోసం కాంగ్రెస్ నాయకులు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం క్యాంపులో రహస్య ప్రదేశాలకు తరలించినట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి తెరలేపిన విషయం తెలిసిందే. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ పరిధిలోని తూప్రాన్‌లో కూడా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అధికార పార్టీ వైపు మొగ్గు చూపడంతో అవిశ్వాసంపై అందరి దృష్టి మళ్లింది. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అధికార పార్టీ వైపు ఉంటేనే అధిక నిధులు రాబట్టి తూప్రాన్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావిస్తున్నట్లు సమాచారం.

రికార్డుస్థాయిలో మల్లన్న హుండీ ఆదాయం

- 45 రోజుల్లో రూ.కోటి 39 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయానికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. హుండీల ద్వారా 45 రోజులలో రూ.1,39,77,230 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బాలాజీ తెలిపారు. గురువారం స్వామి వారి ఆలయ ముఖ మండపంలో మెదక్ జిల్లా దేవాదాయ శాఖ పరిశీలకులు రంగారావు, సహాయకమిషనర్ శివరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ సేవా సమితి సభ్యులు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సౌత్‌ జోన్‌ యోగా పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో పీఈటీ గోవర్ధన్‌ రెడ్డి

గజ్వేల్‌రూరల్‌: ఖేలో ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్‌జోన్‌ యోగా పోటీలకు గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీకి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు పీఈటీ గోవర్ధన్‌ రెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27, 28 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని దిండుగల్‌లో గల పీఎస్‌ఎన్‌ఏ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీలో ఖేలో ఇండియా సౌత్‌ జోన్‌ ఉమెన్స్‌ యోగా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో అంకిత, వైష్ణవి పాల్గొంటారని పేర్కొన్నారు.

నాణాలతో త్రివర్ణ పతాకం



గజ్వేల్‌రూరల్‌: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్‌ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు త్రివర్ణ పతాకం ఆకారాన్ని రూపొందించారు. రూ. 33 వేల విలువ చేసే నాణెంలతో 10 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో త్రివర్ణ పతాకం రూపాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

తేనె టీగల దాడి
15 మందికి గాయాలు


ఆస్పత్రిలో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్‌): నార్సింగి మండల కేంద్రంలో తేనెటీగల దాడిలో 15 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. తహసీల్దార్‌ కార్యాలయ సమీపంలోని చెట్టుకింద వడ్డెర కాలనీకి చెందిన వ్యక్తులు కూర్చున్నారు. అదే సమయంలో ఒక్కసారిగా తేనె టీగలు దాడి చేయడంతో అక్కడ కూర్చున్నవారు గాయపడ్డారు. ఇదే సమయంలో హాస్టల్‌ విద్యార్థులు భోజనం ముగించుకొని బయటకు రాగా తేనెటీగల దాడికి గురయ్యారు. వెంటనే 108 అంబులెన్స్‌లో పీహెచ్‌సీ తరలించి వైద్యం అందించారు. ఇందులో నలుగురు విద్యార్థులు, నలుగురు స్థానికులు ఉన్నారు. నార్సింగి మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రవికుమార్‌ మాట్లాడుతూ.. తేనెటీగల దాడిలో గాయపడి ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులతోపాటు ఇతరులకు వైద్యం అందించామన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

పటాన్‌చెరు టౌన్‌: ప్రైవేటు ట్రావెల్‌ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌ చౌరస్తాలో గురువారం ఉదయం ఓ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఆటోను ఢీకొట్టి పక్కనే ఉన్న తాత్కాలిక దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కూరగాయలు తీసుకెళ్తున్న ఆటో బోల్తా కొట్టింది. డ్రైవర్‌ సత్యనారాయణకు తీవ్రగాయాలు కావడంతో పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరి తెగులు.. రైతు దిగులు

పంటకు కాండం తొలుచు పురుగు బెడద

- ఉమ్మడి మెదక్‌ జిల్లా వ్యాప్తంగా కనిపిస్తున్న ఉనికి
- సిద్దిపేట, మెదక్‌ జిల్లాలో చౌడు, నాచు, జింక్‌ లోపాలు
- ఆదిలోనే గుర్తించాలంటున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.పల్లవి
- పురుగుల నివారణపై రైతులకు సలహాలు, సూచనలు..

వరి సాగు చేసిన రైతులు దిగులు చెందుతున్నారు. పంటకు తెగుళ్లు సోకడంతో ఆందోళనకు గురవుతున్నారు. పురుగుల ఉధృతికి తోడు తెగుళ్లతో పంట నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలతోపాటు తగు సూచనలు పాటించడం వల్ల ఉధృతి తగ్గించవచ్చని ఏరువాక కేంద్రం, తోర్నాల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డా. పల్లవి సూచిస్తున్నారు. రైతులు పంట ప్రారంభంలోనే వీటిని గుర్తించాలని లేని పక్షంలో భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని చెబుతున్నారు. వరిలో కాండం తొలుచు పురుగులు ఇతర తెగుళ్ల నివారణపై ఆమె సూచనలు, సలహాలు..

- మిరుదొడ్డి(దుబ్బాక)

ప్రస్తుత యాసంగి వరిసాగులో ఉమ్మడి మెదక్‌ జిల్లా వ్యాప్తంగా కాండం తొలుచు పురుగుల ఉనికి గమనించినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్ని చోట్ల నారు మడి దశలోనూ, మరి కొన్ని చోట్ల పిలక దశలోనూ గుర్తించినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో కాండం తొలిచే పురుగులు, రెక్కల పురుగులు, గుడ్ల సముదాయాలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. గతంలో దీని నివారణకు రైతులు 10 జీ గుళికలు, సేంద్రియ గుళికలు యూరియాతో కలిపి వేయడంతోపాటు, సైపర్‌ మైత్రిన్‌ లేదా క్లోరిపైపాస్‌ పురుగుల మందును పిచికారీ చేయడం వల్ల పురుగుల నివారణ జరగలేదన్నారు.


డా. పల్లవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

కావున ఈసారి రైతులు సస్య రక్షణ చర్యలతోపాటు సూచనలు పాటించాలన్నారు. ముందుగా కాండం తొలుచు పురుగుల ఉధృతిని గమనించడానికి దీపపు ఎర, సోలార్‌ దీపపు ఎర, లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగులపై నిఘా పెట్టాలి. పిలక దశలో ఎకరానికి 3 లింగాకర్షక బుట్టలను పెట్టాలి. వారం రోజుల వ్యవధిలో ఒక్కో బుట్టలో 25 నుండి 30 పురుగులు పడినట్లు గుర్తిస్తే తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



సస్యరక్షణ చర్యలు

- నారు నాటే వారం రోజుల ముందు ఎకరానికి సరిపడే నారు మడికి 800 గ్రాములు కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్‌ 0.3 గుళికలను వేసుకోవాలి.
- ఒక వేళ నారు మడిలో వేయకపోతే 15 రోజుల వయస్సు ఉన్న పిలక దశలో వరి పైరులో యాసంగి వరి సాగుకు ఎకరానికి కార్బోఫ్యూరాన్‌ 3 జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్‌ హైడ్రో క్లోరైడ్‌ 4 జీ గుళికలు 8 కిలోలు వేయాలి.
- కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే లార్వా దశలో వరి పైరును నష్ట పరుస్తున్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో క్వినాల్‌ పాస్‌ 400 మిల్లీ లీటర్లు, ప్రొఫెనోఫాస్‌ 400 మిల్లీ లీటర్లు లేదా కార్టాప్‌ హైడ్రో క్లోరైడ్‌ 50 ఎస్‌పీ 400 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్‌ 60 మి. లీ. లేదా 100 మి. లీ. టెట్రానిలిపోల్‌ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వరి పైరులో మొగి పురుగుతోపాటు చౌడు, నాచు సల్ఫేడ్‌ దాతు విష ప్రభావం, జింక్‌ లోపం ఇతర రకాల చీడ పీడలు ఆశించడం వల్ల పంట నష్టం జరుగుతోంది.
- ఈ సమస్యలు సిద్దిపేట, మెదక్‌ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి.
- పొలంలో చవుడు, జింకు లోపం వంటి సమస్యలను నివారించడానికి సేంద్రియ గుళికలు, హ్యూమిక్‌ ఆసిడ్‌, సీ- వీడ్‌ ఎక్స్‌ ట్రాక్ట్‌ వేయాలి.
- వరి పైరు ఎదుగుదలకు భూమిలో ఉన్న శిలింద్రాలను నివారించడానికి కలుపు తీసిన తర్వాత ఒక ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా మరియు కార్బెండా జిమ్‌ 25 శాతం+ మ్యాంకోజెబ్‌ 50 శాతం పొడి మందును కలిపి బురద పదునులో చల్లుకోవాలి.
- జింక్‌ లోపం కనిపించినట్లయితే జింక్‌ సల్ఫేట్‌ (21 నుంచి 33 శాతం) 2 గ్రాములు లీటర్‌ నీటికి కలిపి ఎకరానికి ఐదు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.


నారుమడిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అగ్గి తెగులు నివారణ :

- నాట్లు వేసిన కొన్ని ప్రాంతాలల్లో వరి పంటలో అగ్గి తెగులు (మెడ విరుపు) కూడా కనిపిస్తోంది.
- ఎక్కువ దిగుబడి సాధించాలన్న ఆలోచనతో ఉన్న రైతులు అనుకున్న దానికంటే ఎక్కువ మెతాదులో యూరియాను వాడడం వల్ల అగ్గి తెగులుకు ఆజ్యం పోస్తోంది.


ప్రాథమిక దశలో వరి అగ్గి తెగులు

- అధిక మోతాదులో యూరియాను వాడడం వల్ల ఈ తెగులు ఎక్కువగా ఆశించే ఆవకాశాలు ఉన్నాయి.
- అగ్గి తెగులును గుర్తించిన రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడైతే అగ్గి తెగులను గమనిస్తారో అక్కడ యూరియా మోతాదును పూర్తిగా తగ్గించాల్సి ఉంటుంది.
- ఈ లక్షణాలను గుర్తించిన యెడల 300 మిల్లీ లీటర్‌ ఇసోప్రోథయోలెన్‌ లేదా 500 గ్రాముల ట్రైసైక్లోజోల్‌ + మ్యాంకోజెబ్‌ లేదా 500 మిల్లీ లీటర్ల కాసుగామైసిన్‌ మందులను లీటర్‌ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- రైతులు పంట ప్రారంభం నుంచి చివరి వరకు గమనిస్తూ తెగుళ్లను గుర్తించి సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి ఆర్జించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

భార్యను తీసుకెళ్లడానికి వస్తుండగా..
రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాచెరు మండలం ముత్తంగికి చెందిన ప్రదీప్‌ (30) ఓ ప్రైవేట్‌ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం భార్య ఆశ షాపింగ్‌కు హైదరాబాద్‌ వెళ్లింది. తిరిగి వచ్చే క్రమంలో తనను పటాన్‌చెరు బస్టాండ్‌ వద్దకు వచ్చి తీసుకెళ్లమని భర్త ప్రదీప్‌కు చెప్పింది. ప్రదీప్‌ అదే రోజు అర్ధరాత్రి బైక్‌పై వస్తుండగా పటాన్‌చెరు శివారులోని ధర్మకాంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఆశ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఛాతీలో నొప్పి.. అంతలోనే మృతి

పటాన్‌చెరు టౌన్‌: ఛాతిలో నొప్పితో కుప్పకూలి యువకుడు మృతి చెందిన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లా బుడంగి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన సూర్య నారాయణ (25) బతుకు దెరువు కోసం ఏడాది క్రితం జిన్నారం పరిధిలోని మాదారానికి వచ్చి ఉంటున్నాడు. అమీన్‌పూర్‌ పరిధి సుల్తాన్‌పూర్‌లోని మెడికల్‌ డివైస్‌ పార్క్‌లో వీరికో బయోటెక్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌లో వాటర్‌ ప్లాంట్‌ వద్ద పని చేస్తున్నాడు. బుధవారం పని చేసే చోట సూర్యనారాయణ ఛాతీలో నొప్పి వస్తుందంటూ చెప్పి కుప్పకూలాడు. తోటి కార్మికులు వెంటనే బీరంగూడలోనే ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇండియా మిషన్‌ ఆస్తులు అమ్మడం నేరం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ఇండియా మిషన్‌ ఆస్తులను అమ్మినా, కొన్నా నేరం అవుతుందని ఇండియా మిషన్‌ ప్రతినిధులు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో ఇండియా మిషన్‌ ముఖ్యులు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇటీవల పట్టణ కేంద్రంలో ఉన్న మిషన్‌ కాంపౌండ్‌ స్థలాన్ని గోపిజోనా, అగ్రిప్పా అనే వ్యక్తులు అక్రమంగా నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముతున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. కాంపౌండ్‌ దాదాపు 90 ఏళ్ల క్రితం ఏర్పడి ఈ ప్రాంత ప్రజలకు ఎంతోమందికి వైద్యం, విద్యను అందిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా కొనసాగుతుందన్నారు. ఈ స్థలాన్ని ఎవరూ అమ్మడానికి, కొనడానికి వీలులేదన్నారు. కార్యక్రమంలో రెవ శామ్యూల్‌, టీ. డేవిడ్‌, టీ.ప్రణబ్‌ కుమార్‌, పజాషువా, జీవరత్నం, పౌలు కే, జాన్సన్‌, బాబు, ప్రభాకర్‌, ప్రసాద్‌ కుమార్‌, శీను, దేవదాస్‌, యాకోబు, క్రిస్టఫర్‌, దినకర్‌, రాజు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


వాహనదారులతో ప్రమాణం చేయిస్తున్న లక్ష్మణ్‌


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

- ఇన్‌చార్జి డీటీఓ లక్ష్మణ్‌
- జిల్లాలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): రహదారులపై ప్రమాదాలు జరగకుండా అందరం బాధ్యత తీసుకోవాలని సిద్దిపేట రవాణాశాఖ ఇన్‌చార్జి అధికారి లక్ష్మణ్‌ అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. ఓవర్‌ స్పీడ్‌, ఓవర్‌ టేక్‌ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్లు నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్ష ఉంటుందన్నారు. అంతకుముందు విధి నిర్వహణలో డ్రైవర్‌కు గుండెపోటు వస్తే సీపీఆర్‌ చేసి ఏ విధంగా రక్షించాలో వైద్య సిబ్బంది వాహదారులకు అవగాహన కల్పించారు.

హెల్మెట్‌ తప్పనిసరి : సీఐ రామకృష్ణ

సిద్దిపేటకమాన్‌: వాహనదారులు ట్రాఫిక్‌, రోడ్డు నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ రామకృష్ణ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట మోడ్రన్‌ బస్టాండ్‌ వద్ద గురువారం వాహనదారులు, ప్రజలు, వ్యాపారులకు ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్‌ఐ వినయ్‌సాగర్‌, ఏఎస్‌ఐ ఉమేష్‌, కానిస్టేబుళ్లు మహేష్‌, జగదీశ్‌, గోపాల్‌, జనార్ధన్‌, ట్రాఫిక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ
హుండీలోని నగదు, బంగారం అపహరణ


ఆధారాలు సేకరిస్తున్న ఎస్‌ఐ శంకర్‌

మర్కూక్‌(గజ్వేల్‌): గుర్తు తెలియని వ్యక్తులు పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఘటన మర్కూక్‌ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మహంకాళీ దేవాలయంలో హుండీని పగులగొట్టి నగదును, సీసీ కెమెరాల డీవీఆర్‌లను ఎత్తుకెళ్లారు. అలాగే, ఎల్లమ్మ దేవాలయం హుండీని పగులగొట్టి నగదును, బంగారు మంగళసూత్రాన్ని దొంగిలించారు. పక్కనే ఉన్న పెద్దమ్మ తల్లి హుండీలోని డబ్బులను, చిన్న వెండి తొట్టెల ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్‌) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దంపతులకు తీవ్ర గాయాలైన ఘటన తూప్రాన్‌- నర్సాపూర్‌ హైవే పై గురువారం చోటుచేసుకుంది. నర్సాపూర్‌కు చెందిన నెనావత్‌ తారి గోరాం దంపతులు బుధవారం శివ్వంపేట మండలం చెండి పరిధి తండాలో జరిగిన విందులో పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం టీవీఎస్‌ ఎక్సెల్‌పై నర్సాపూర్‌కు బయలుదేరారు. చాకరిమెట్ల అటవీ ప్రాంతంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా నర్సాపూర్‌ ప్రభుత్వాత్రికి తరలించారు. గోరాం కోమాలోకి వెళ్లడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కి తరలించారు.

హెరాయిన్‌ ముడి పదార్థం స్వాధీనం

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): హెరాయిన్‌ తయారీలో ఉపయోగించే పాప్పి స్ట్రా పౌడర్‌ అనే ముడి పదార్థాన్ని ఎక్సైజ్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ మెదక్‌ డివిజన్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ రఘురామ్‌ గురువారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌ రావు ఆధ్వర్యంలో సదాశివపేట మండల పరిధిలోని నందికంది శివారులో గల రాందేవ్‌ రాజస్థాన్‌ దాబాలో నమ్మదగిన సమాచారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ.లక్ష విలువ చేసే 210 గ్రాముల పాప్పి స్ట్రా పౌడర్‌ అనే ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన మూల రామ్‌, జగ్జీవన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ ముడి పదార్థాన్ని రాజస్థాన్‌ నుంచి తీసుకొచ్చి దాబాకు వచ్చే వ్యక్తులకు అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రఘురామ్‌ తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐలు మోహన్‌ కుమార్‌, రమేశ్‌ రెడ్డి, రజిత, ఎస్‌ఐలు విశ్వనాథ్‌, అనిల్‌, సిబ్బంది అలీమ్‌, గోపాల్‌, రామారావు, మల్కయ్య, అనిల్‌, సతీశ్‌ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రఘురామ్‌

అప్పుల బాధతో ఇద్దరు ఆత్మహత్య

అప్పుల బాధతో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. గజ్వేల్‌లో చెట్టుకు ఉరివేసుకోగా, వర్గల్‌లో పురుగుల మందు తాగి చనిపోయారు.

గజ్వేల్‌రూరల్‌: అప్పుల బాధ్యతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన సల్లూరి జయరాములు(55)కు భార్య యాదమ్మ, కుమారుడు సాయిరాం ఉన్నారు. కూలీ పనులతోపాటు ట్రాలీ గూడ్స్‌ వాహనం కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నాడు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసిన తర్వాత గతంలో కుటుంబ పోషణకు, జయరాము అనారోగ్యం బారిన పడగా ఆస్పత్రి ఖర్చులకు, ట్రాలీ గూడ్స్‌ కొనుగోలు కోసం చేసిన అప్పుల గురించి చర్చించుకున్నారు. సుమారుగా రూ. 10లక్షల వరకు అప్పులు కాగా వాటిని తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురైన జయరాములు అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతుకుతుండగా గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మద్యానికి బానిసై..

వర్గల్‌(గజ్వేల్‌): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వర్గల్‌ మండలం శేరిపల్లిలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై విజయభాస్కర్‌ వివరాల ప్రకారం.. శేరిపల్లికి చెందిన బోయిని ప్రభాకర్‌(35)కు భార్య శ్యామల, పదమూడేళ్ల లోపు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉంది. మూడేళ్ల క్రితం ఫైనాన్స్‌ ద్వారా ట్రాక్టర్‌ను కొనుగోలు చేయగా సరిగా నడవలేదు. కిస్తీలు (వాయిదాలు) సక్రమంగా కట్టకపోవడంతో ఫైనాన్స్‌ వారు ట్రాక్టర్‌ తీసుకెళ్లారు. ఈ క్రమంలో అప్పులు పెరిగి మద్యానికి బానిసయ్యాడు. ఇరవై రోజుల క్రితం మద్యం తాగేందుకు ఇంట్లోని బియ్యం అమ్మాడు. ఈ విషయమై నిలదీసిన భార్య శ్యామలను కొట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. ఆమె పిల్లలతో సహా తల్లి గారింటికి వెళ్లిపోయింది. అప్పుల బాధ, మద్యానికి బానిసైన ప్రభాకర్‌ జీవితంపై విరక్తి చెంది గురువారం తన చేను వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ప్రభుత్వాస్పత్రి రోడ్‌లో ప్రమాదకరంగా..


కరీంనగర్‌ రోడ్‌లో నరికివేసిన చెట్లు

అమ్మో.. కోనోకార్పస్‌

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. అనేది నానుడి. అయితే ఇది అన్ని రకాల చెట్లుకు వర్తించదని కోనోకార్పస్‌ వృక్షాలు రుజువు చేస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో, పార్క్‌లలో కోనో కార్పస్‌ చెట్లు విపరీతంగా నాటడడంతో అవి ఏపుగా పెరిగి ఇప్పుడు ప్రజలకు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఈ చెట్ల కారణంగా శ్వాసకోశ వ్యాధులు వస్తున్నట్లు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్ల తొలగించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని పలు కాలనీ ప్రజలు పేర్కొన్నారు. అలాగే కరీంనగర్‌రోడ్‌లో కరెంట్‌ తీగలకు అడ్డుగా ఉన్నాయని మున్సిపల్‌ అధికారులు, విద్యుత్‌ అధికారులు కొన్ని చెట్లను నరికించారు. ఇలానే పూర్తి స్థాయిలో పట్టణంలోని అన్ని కోనో కార్పస్‌ చెట్లను తొలగించాలని డిమాండ్‌ చేస్తున్నారు.

-సాక్షి, స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌,సిద్దిపేట


నగదును అందజేస్తున్న ఎస్‌ఐ రామానాయుడు, తదితరులు


తలపడుతున్న మల్లయోధులు

కుస్తీ మే సవాల్‌

న్యాల్‌కల్‌ మండల పరిధిలోని రత్నాపూర్‌ గ్రామంలో మైబు సభానీ దర్గా ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ఉదయం ప్రారంభమైన కుస్తీ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీల్లో సుమారు 60 మంది పైల్వాన్లు హాజరయ్యారు. చివరకు మహారాష్ట్రాలోని ఉద్గీర్‌కు చెందిన కుతూబ్‌కు మొదటి బహుమతి వరించింది. కుతూబ్‌కు హద్నూర్‌ ఎస్‌ఐ రామానాయుడు వెండి కడియం అందజేశారు. ఇతర విజేతలకు ఎస్‌ఐతోపాటు గ్రామ పెద్దలు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ రవి, శ్రీరామ్‌ ప్రజా సేనా అధ్యక్షుడు జనార్దన్‌ గౌడ్‌, జైనోద్దీన్‌, షబ్బీర్‌, అహ్మద్‌, చాకలి శివకుమార్‌, శ్రీన్‌, హన్మంత్‌ తదితరులు పాల్గొన్నారు.

-న్యాల్‌కల్‌(జహీరాబాద్‌

క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాపోటీల్లో పాల్గొన్న న్యాయవాదులు

నారాయణఖేడ్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌స్వరూప్ షెట్కార్ ఆధ్వర్యంలో గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌స్వరూప్‌షెట్కార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మారుతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, బోజిరెడ్డి, నర్సింహారావు, సాయిలు, భువనేశ్వరి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసర్వే అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సిద్దిపేటరూరల్: చిన్నగుండవెల్లి గ్రామం గుండా నిర్మించనున్న జాతీయ రహదారి కోసం అధికారులు చేపట్టిన భూ సర్వేను గ్రామస్తులు అడ్డుకున్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామంలో సూర్యాపేట నుంచి సిరిసిల్ల వరకు నిర్మించనున్న జాతీయ రహదారి నిర్మాణానికి అధికారులు భూసేకరణ సర్వే చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సర్వే చేయొద్దని అధికారులను అడ్డుకున్నారు. రోడ్లు, భవనాలు శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో చర్చించారు. గ్రామస్తుల నిర్ణయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘోత్తంరెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులు, గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు అన్నారు. గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బందితో కలసి వినూత్న ప్రయత్నం చేశారు. హెల్మెట్ ధరించని వాహదారులకు పువ్వు ఇచ్చి హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు.

యూనిఫామ్ అందజేత

సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన గనగోని అశోక్ గౌడ్ తన అన్న మాజీ సర్పంచ్ లింగం గౌడ్ జ్ఞాపకార్థం స్కూల్ యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కోసం తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏర్వ రమేష్, హెచ్ఎం మంజుభార్గవి, ఎస్ఎంసీ చైర్మన్ రామిండ్ల కనకరాజు, కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

దుబ్బాకరూరల్: మండలంలోని ఆరెపల్లి గ్రామ రైతులు సాగుచేస్తున్న వరి పొలాలను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వరి పంటకు కాండం తొలుచు పురుగు, మొగిలి ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ఏఈఓల సలహాలు తీసుకోవాలన్నారు.

దుప్పట్ల పంపిణీ

మెదక్ కలెక్టరేట్: ఎంఎస్ అగర్వాల్ ఫౌండరీస్ సౌజన్యంతో మెదక్‌లోని గిరిజన వసతి గృహాల విద్యార్థులకు గురువారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని విజయలక్ష్మి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలోని వసతి గృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీతో పాటు కనీస అవసరాల నిమిత్తం గురువారం ఎంఎస్ అగర్వాల్ ఫౌండరీస్ వారు రూ. లక్ష చెక్కును కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ అధికారులు నేమాని సుధీర్, వసంత్ కుమార్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కూడా ఎంఎస్ అగర్వాల్ ఫౌండరీస్ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్పొరేట్ రిలేషన్ ఆఫీసర్ వెంకట్, హెచ్‌ఆర్ మీనా, ఇతర ఉద్యోగులు, గిరిజన సంక్షేమ శాఖలోని ఇతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఓటుహక్కు వినియోగించుకోవాలి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్



మాట్లాడుతున్న ఏసీపీ చంద్రశేఖర్



హుస్నాబాద్‌లో..

గజ్వేల్: పౌరులు తమ కనీస బాధ్యతగా ఓటుహక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిషత్‌లో ఓటుహక్కుపై చర్చ జరిగిన తర్వాత కుల, మత, వర్ణ, లింగ, ధనిక, పేద తేడా లేకుండా ప్రతీ భారతీయుడికి ఓటుహక్కు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ బాల్‌రాజు, వైస్‌ప్రిన్సిపాల్ గణపతి, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌బాబు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవానీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ పెద్దిరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: సమాజ స్థితిగతులను మార్చే శక్తి ఓటుహక్కుకు మాత్రమే ఉందని బీజేపీ సీనియర్ నాయకుడు, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో నూతన ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి విభీషణ్‌రెడ్డి, సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బెజ్జంకి తహసీల్దార్ శ్యాం సూచించారు. గురువారం నిర్వహించిన ఓటరు దినోత్సవంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దార్ గోవర్ధన్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి ఓటుహక్కుపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, డీటీ వీరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫహీం, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భారతీ దేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లతో ప్రతిజ్ఞ

వర్గల్(గజ్వేల్): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వర్గల్ మండలంలో ర్యాలీలు, ఓటర్లతో ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. వర్గల్‌లో జెడ్పీహైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద వయోవృద్ధులను తహసీల్దార్ హరికిరణ్‌కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజు, నాగరాజుగౌడ్, సూపర్‌వైజర్లు శ్రీశైలం, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కోహెడ(హుస్నాబాద్): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోక్కుల కీర్తి, ఎంపీటీసీ సభ్యురాలు ఖమ్మం స్వరూప, కోహెడ ఏఎంసీ చైర్మన్ తిప్పారపు జ్యోతి, ఎంపీడీఓ మధుసూదన్, ఆర్ఐ హరీశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యం విజయవంతమయ్యేందుకు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఓటుహక్కు ప్రాధాన్యతను డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుజాత, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి వివరించారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, పీఎస్‌ఆర్ ట్రస్టు నిర్వాహకులు నరేందర్, నాయకులు సంపత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

దుబ్బాక: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన ఓటుహక్కును వినియోగించుకోవాలని దుబ్బాక ఎన్నికల నోడల్ అధికారి, ఏసీపీ చంద్రశేఖర్ అన్నారు. జాతీయ ఓటరు దినత్సోవం సందర్భంగా గురువారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు.అధికారులు, ప్రజలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

31న గద్దర్ విగ్రహావిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): దివంగత గద్దర్ జయంతి సందర్భంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ చౌరస్తాలో ఈనెల 31న గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య, తెల్లాపూర్ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెలిపారు. దానికి సంబంధించిన పోస్టర్, కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతున్నట్లు చెప్పారు. గద్దర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్ గౌడ్, బీఎస్పీ నాయకుడు బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, రచయిత, కవి పసునూరి రవీందర్, కాంగ్రెస్ నాయకులు అరుణ్ గౌడ్, అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి: సీపీఎం



నీటి సమస్య వివరిస్తున్న స్థానికులు

చేర్యాల(సిద్దిపేట): అవినీతికి పాల్పడుతూ వార్డు అభివృద్ధి పట్టించుకోని వార్డు కౌన్సిలర్‌పై చర్యలు తీసుకువాలని సీపీఎం పట్టణ నాయకుడు పోలోజు శ్రీహరి డిమాండ్ చేశారు. గురువారం 2వ వార్డులో సీపీఎం నాయకులు పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ వార్డు కౌన్సిలర్ చెవిటి లింగం అవినీతికి పాల్పడుతూ వార్డు అభివృద్ధి విస్మరించాడని ఆరోపించారు. వార్డు అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను మరో వార్డుకి బదలాయించి కమీషన్ తీసుకున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండకింది అరుణ్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం
అందజేస్తున్న నాయకులు

నర్సాపూర్ రూరల్: కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కదారి నాగరాజు కోరారు. గురువారం నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రవాణా రంగంలో సుమారు 25 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నా ప్రభుత్వాలు వారిని పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పిల్లల చదువులు, కార్మికులకు బీమా సౌకర్యం, పిల్లల పెళ్లిళ్లకు సహకారం వంటివి బోర్డులో పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత 106(1)(2)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సగౌడ్, ఆంజనేయులు గౌడ్, కుమార్, వెంకట్ చారి, నరేష్ గౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపే నిజమైన ప్రగతి



ఉద్యోగులతో ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ప్రజల జీవన ప్రమాణాలు పెరిగితేనే నిజమైన ప్రగతి అని, అభివృద్ధి అంటే రోడ్లు నిర్మించడం, భవనాలు కట్టడం కాదని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గురువారం రాత్రి ఎన్జీఓ భవన్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సిద్దిపేట ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమైందన్నారు. కేన్సర్ లాంటి మహమ్మరిని యోగ ద్వారా జయించే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ యోగ, ధ్యానం చేయాలని సూచించారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో వీరశైవ లింగాయత్ సమాజం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా నంగనూర్ మండలంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్, ఎన్జీఓ భవన్ అధ్యక్షుడు అంజయ్య, మున్సిపల్ కౌన్సిలర్ సాయి ఈశ్వర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. పౌర్ణమి సందర్భంగా వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్, లిల్లీ, శ్రీనివాస్‌రావు, సత్యనారాయణగౌడ్ ఏర్పాట్లు చేశారు.

గణతంత్ర వేడుకల్లో సిద్దిపేట కళాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత ప్రభుత్వం పర్యాటక శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో సిద్దిపేటకు చెందిన అభినయ నృత్య నికేతన్ నాట్యాచార్యులు జయప్రద, సంతోష్ శిష్య బృందం పేరిణి నృత్యం ప్రదర్శించనున్నట్లు సంతోష్ గురువారం తెలిపారు. శుక్రవారం 20 మంది కళాకారులతో న్యూఢిల్లీకి బయలుదేరనున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో సిద్దిపేట కళాకారులకు ఇలాంటి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బూత్ లెవల్ సమావేశానికి హాజరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ సమావేశానికి హాజరయ్యేందుకు జిల్లా కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వెళ్లినవారిలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరి కృష్ణ తదితరులు ఉన్నారు.

వరి కొయ్యల్లో పంట సాగు మేలు

దౌల్తాబాద్(దుబ్బాక): దుక్కి దున్నకుండానే వరి కొయ్యల్లో మొక్క జొన్న విత్తడంవల్ల పంట సాగు ఖర్చు తగ్గి అధిక దిగుబడి వస్తుందని ఏఈఓ ప్రవీణ్ అన్నారు. గురువారం ముబారస్‌పూర్‌లో వరి కొయ్యల్లో సాగుచేస్తున్న మొక్క జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి తర్వాత మొక్క జొన్న సాగు చేయడం వల్ల పంట మార్పిడితో పాటు చీడపీడల సమస్యలు తగ్గుతాయన్నారు. అధిక దిగుబడితో పాటు నాణ్యత గల మొక్కజొన్న చేతికి వస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ తిరుపతి, రైతు స్వామిగౌడ్, తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభం

దుబ్బాకరూరల్: మండలంలోని గోసాన్‌పల్లి, చీకోడ్ పంచాయతీ భవనాలు, హెల్త్‌సెంటర్, కూరగాయల మార్కెట్, రజక కమ్యూనిటీ భవనం, ప్రాథమిక పాఠశాల భవనాలను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శివ్వంపేట(నర్సాపూర్) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్– నర్సాపూర్ హైవే పై గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గోమారం గ్రామానికి చెందిన చినపాపి భిక్షపతి(32) తూప్రాన్ నుంచి గోమారానికి బైక్ పై వస్తున్నాడు. ఉసిరికపల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భిక్షపతి తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య రాణి, చిన్న వయస్సు గల ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పాలక వర్గం, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత హెచ్చరించారు. గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాయం ఆవరణలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేటలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 3వ వార్డుకు నిధులు కేటాయించడంలో వివక్ష చూపారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 3వ వార్డు కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. గతంలో దుబ్బాక మున్సిపల్‌కు టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి రూ.20 కోట్లు మాజీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో మంజూరైతే, తన వల్లే నిధులు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే దుబ్బాక గడ్డపై తిరుగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవలక్ష్మి సంజీవరెడ్డి, ఆస యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు రాజమౌళి పంతులు, బాలకిషన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి , నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన పడొద్దు



స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ బాబు నాయక్

రాయపోలు(దుబ్బాక): రైతులు యాసంగి పంటలను సాగుచేసుకోవాలని, ఎరువుల విషయంలో ఆందోళన అవసరం లేదని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన రాయపోలులోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఏఈఓ ప్రశాంత్, రైతులు తదితరులున్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష సరికాదు

కౌన్సిలర్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న కౌన్సిలర్ మల్లారెడ్డి

దుబ్బాక: మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు హయాంలో దుబ్బాక మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లు మంజూరయ్యాయని, అన్నివార్డులకు కేటాయించి తన వార్డుకు కేటాయించకుండా వివక్ష చూపడం దారుణమని చెల్లాపూర్ 3వ వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం దుబ్బాకలో కౌన్సిలర్ మల్లారెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేస్తే తమపై చేయాలని వార్డు అభివృద్ధిని అడ్డుకునేలా నిధులు కేటాయించకుండా వివక్ష చూపడం విచారకరమన్నారు. దుబ్బాక మున్సిపల్‌లో గతంలో హరితహారంలో, కోఆపరేటివ్ సొసైటీలో అవినీతి జరిగితే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పందించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయితీ భవనాలను నిర్మిస్తే ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు దుబ్బాకపై చిత్తశుద్ధి ఉంటే కోఆపరేటివ్ సొసైటీలో జరిగిన అవినీతికి పాల్పడినవారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించండి

దళిత సంఘాల డిమాండ్



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న
దళిత సంఘాల నాయకులు

జహీరాబాద్ టౌన్: కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జహీరాబాద్ పట్టణంలో దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు కర్ణం రవికుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరచడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

చేర్యాల(సిద్దిపేట): ఆకునూర్ గ్రామ డబుల్ బెడ్ రూం ఇళ్లకు తాగునీరు సరఫరా చేయాలని సీపీఐ

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్

జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. గురువారం డబుల్ బెడ్ రూం కాలనీ వాసులతో కలిసి ఆకునూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పులి బాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసముంటున్న కాలనీవాసులకు కొన్నాళ్లుగా మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో వారు అనేక ఇబ్బందులుపడుతున్నారన్నారు. వెంటనే నీటిని సరఫరా చేయాలన్నారు.

వంటకాలు అదుర్స్

ఆచార్య డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివెల్



తయారుచేసుకొని వచ్చిన వంటలతో విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నోరూరించే వివిధ రకాల వంటలను తయారుచేసుకొని వచ్చారు. బిర్యానీ, జీరా రైస్, పులిహోర, దోశలు, ఇడ్లీ, గారెలు, పాయసం, కట్ లైట్, పూరీలు, స్వీట్స్, లడ్డు తదితర వంటకాలు అదుర్స్ అనిపించాయి. వంటల పోటీలతో పాటు ముగ్గులు, మెహందీ, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ వంటకాలను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నందుగౌడ్, విజయలక్ష్మి అధ్యాపకులు నర్సింహులు, రమేష్, నిఖిత, దీపిక, శ్వేత, లావణ్య, కరుణ, ఇర్షద్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ఎల్లారెడ్డిపేటలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి, లింగంపేట, ఎల్లారెడ్డిపేట, పెద్ద మాసాన్‌పల్లి, గుడికందుల, వర్ద రాజుపల్లి గ్రామాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. తాను 15రోజుల క్రితం మంత్రి వెంకటరెడ్డిని కలిసి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేయాలని కోరామన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా మంత్రి కొండా సురేఖ అర్ధరాత్రి వేళ నీటిని విడుదలచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం గుడికందులలో యువజన క్రీడోత్సవాల్లో బాగంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ప్రారంభించారు.